క్లుప్తంగా

నేడు రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా వానాకాలం మొదటి విడత నిధుల విడుదలకు సంబంధించి సోమవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి జానకిరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండమల్లేపల్లి రైతు వేదికలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు.

నేడు రైతు వేదికలో రైతు నేస్తం

నిడమనూరు : నిడమనూరు మండలకేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయాధికారి ఎం మునికృష్ణయ్య తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రానున్న వానకాలంలో సాగుకు రైతన్నలను సన్నద్ధం చేసేవిధంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు సూచనలు అందజేస్తారని ముని కృష్ణయ్య తెలిపారు. ఆధునిక సాగు పద్ధతులు, సాగులో యాజమాన్యం పద్ధతుల వివరాలను రైతులకు వివరిస్తారని తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడుతారని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన


ఊట్కూర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

నిడమనూరు : మండలంలోని ఊట్కూరులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని మాజీ మంత్రి జానారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఊట్కూరులో 8 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండటంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు అవకాశాలను స్థానిక నాయకులతో జానా చర్చించారు. ఈ కార్యక్రమంలో జానా వెంట స్థానిక నాయకులు నర్సింగ్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ కొండేటి మల్లయ్య, ఎడవెల్లి వల్లభరెడ్డి, చెర్క శ్రీను తదితరులు ఉన్నారు.

మట్టారెడ్డికి నివాళి

మండలకేంద్రానికి చెందిన మేరెడ్డి మట్టారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి జానారెడ్డి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మట్టారెడ్డి కుమారుడు మేరెడ్డి వెంకట్రాహుల్, మనవడు మేరెడ్డి కృష్ణవివేక్, ఎడవెల్లి వల్లభారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి : మండలంలోని చెన్నంనేనిపల్లి ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు ఎద్దుళ్ల ఎల్లయ్య మాదిగ పోలేని యాదయ్యమాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కాగా గ్రామ శాఖ అధ్యక్షుడిగా నిరసనమెట్ల రామకృష్ణమాదిగ, ప్రధాన కార్యదర్శిగా సైదులుమాదిగ, ఉపాధ్యక్షునిగా రాంబాబు, కార్యదర్శిగా భిక్షమయ్య, అధికార ప్రతినిధిగా విష్ణుమాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీరాములుమాదిగ, అంజి, గణేస్, శేఖర్‌మాదిగ, సుమన్, జైహింద్ పాల్గొన్నారు.

20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి

అడవిదేవులపల్లి : 2025-26 సంవత్సరానికిగాను పట్టాదారు పాస్ పుస్తకం పొందిన వారు ఈనెల 20వ తేదీలోగా రైతు భరోసాకు దరఖాస్తులు చేసుకోవాలని అడవిదేవులపల్లి మండల వ్యవసాయ అధికారిని గుర్రం సరిత ఒక ప్రకటనలో కోరారు. రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునే వారు ధరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో మండల విస్తీర్ణ అధికారికి అందించాలన్నారు.

రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం రసూల్ మృతి



మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తుంగపాడు ప్రభుత్వ పాఠశాల రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు గులాం రసూలు(85) ఆదివారం అకాల మృతి చెందాడు. మిర్యాలగూడ మండలం తడకమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా 18ఏళ్ల పాటు పనిచేశారు. అక్కడ నుంచి సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతపై వెళ్లారు. అక్కడి నుంచి మిర్యాలగూడ మండలం తుంగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం పట్టణంలోని బంగారుగడ్డలో గల భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆకాల మృతి చెందడంతో ఉపాధ్యాయులు మంగ్యానాయక్, బక్క శ్రీనివాసాచారి, లింగంపల్లి అంజయ్య, సత్యం, వెంకన్న, కోట్యానాయక్, పూర్వ విద్యార్థులు రాచకొండ వెంకన్న, శ్రీనివాస్‌రావు, కాతోజు నాగాచారిలతో పాటు పలువురు ఉపాధ్యాయులు పరామర్శించారు.

రహదారికి మోక్షం ఎప్పుడో..

- అధ్వానంగా బీమారం - సూర్యాపేట రహదారి
- ఏళ్లుగా పూర్తి కాని రోడ్డు, కల్వర్టు పనులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


సల్కునూరు ఎక్స్‌రోడ్డు వద్ద వంతెనకు ఇరువైపులా ఏర్పడిన గుంతలు

వేములపల్లి : సంవత్సరాలు గడుస్తున్నా బీమారం-సూర్యాపేట రహదారికి మోక్షం కలగడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలిచింది. సకాలంలో పనులను పూర్తిచేయాల్సిన కాంట్రాక్టర్లు సైతం నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరించడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ-సూర్యాపేట జిల్లా కేంద్రాలను కలిపే అంతర్ జిల్లాల రహదారి విస్తరణ పనులు 9ఏళ్లయినా పూర్తికాని పరిస్థితి నెలకొంది. మిర్యాలగూడ-సూర్యాపేట రెండు వ్యాపార వాణిజ్య కేంద్రాలు కాగా 29 కిలోమీటర్ల దూరంతోనే రెండు పట్టణాలకు శెట్టిపాలెం వయా బీమారం మీదుగా సూర్యాపేట రహదారి మీదుగా విస్తరణ పనులు చేపట్టారు. ఇటు ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మిర్యాలగూడ నుంచి సూర్యాపేటకు వెళ్లే ఈ రహదారిని విసర్తించేందుకు 2016 జూలై 7న నెలలో రూ.48.2 కోట్ల వ్యయంతో 28.4కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను మాజీ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. సూర్యాపేట నుంచి కూసుమంచిగూడెం నుంచి శెట్టిపాలెం ఎక్స్‌రోడ్డు వరకు 2016 నవంబర్‌లో పనులు ప్రారంభించడం జరిగింది. సూర్యాపేట నుంచి శెట్టిపాలెం ఎక్స్‌రోడ్డు వరకు నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి వరకు సుమారు 29కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విస్తరణ పనులు పూర్తికాలేదు. విస్తరణ పనుల్లో భాగంగా ఇప్పటివరకు రూ.20 కోట్ల మేరకు పనులు పూర్తయినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనా వేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా లక్ష్మీదేవిగూడెం- బీమారం బైపాస్ రోడ్డుకు 15 ఎకరాలు భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవడం జరిగిందని, అందుకు రైతులకు పరిహారం కింద రూ.2కోట్లు సైతం మంజూరు చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. అయితే నాటి నుంచి నేటివరకు పనులు నత్తనడకగా కొనసాగిస్తుండడంతో ప్రయాణికులతోపాటు స్థానిక ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. చిన్న చిన్న వంతెనల పనులను సైతం నిలిపివేయడంతో ప్రయాణికుల పరిస్థితి దారుణంగా మారింది. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రహదారిపై రాత్రి వేళ ప్రయాణికులు వెళ్లాలంటే జంకుతున్నారు. రాత్రివేళ ఈ రహదారిపై పలు రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు తీవ్ర గాయాలపాలైన సంఘనలు చోటుచేసుకున్నాయి. 2022లో కొంత మేరా తార పనులు పూర్తయినా ప్యాచ్‌వర్క్‌లు, కాజ్‌వేలు (కల్వర్టులు)పై బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాక రోడ్డుపై ప్రయాణం భారంగా మారిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణ పనులు రెండేండ్లలో పూర్తి చేయాల్సి ఉంది. అయినా పనులు నేటి వరకు ఆగుతూ సాగుతూ నడుస్తూనే ఉన్నా పట్టించుకునే నాదుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వంతెనలు పూర్తయినా రక్షణ గోడలు లేవు.

వంతెన నిర్మాణం పూర్తయినా వాటికి రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ప్రయాణానికి అనువుగా లేని పరిస్థితి నెలకొంది. వంతెన ఇరువైపులా గుంతలు ఏర్పడి ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు పనుల్లో వేగాన్ని పెంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కల్వర్టులు.. ప్రమాదాలకు నిలయాలు

2022లో తారు వేయడం పూర్తయినా నేటి వరకు అక్కడక్కడ కాజ్‌వేలు పూర్తి కాకపోవడంతో ఈ కాజ్‌వేలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఆమనగల్లు చెరువు నుంచి వచ్చే వరదకు లక్ష్మీదేవిగూడెం వద్ద కాజ్‌వే ఉంది. ఇది చిన్న వర్షానికి అలుగుపోస్తుంది. గతంలో అలుగు పోసే సమయంలో ఆమనగల్లుకు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంతో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఈ వంతెనను అధికారులు ఇప్పటికైనా పునర్‌నిర్మించి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. సల్కునూరు ఎక్స్‌రోడ్డు వద్ద గోదాం లిఫ్ట్ కాల్వ వరద సాగే మూడు వంతెనలు అసంపూర్తిగా నిలిచిపోయి దర్శనమిస్తున్నాయి.

రోడ్డు నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలి



దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న బీమారం-సూర్యాపేట రహదారి పనులను సత్వరమే పూర్తి చేయాలి. రోడ్డుపై కల్వర్టు పనులు ఎక్కడికక్కడ పెండింగ్‌లో ఉండడతో నిత్యం వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇప్పటికై నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోని పనులు సకాలంలో పూర్తయ్యేలా కృషి చేయాలి.

– రెమడాల పరుశురాములు (మొల్కపట్నం)

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి


వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న జన విజ్ఞానవేదిక నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని ప్రముఖ నరాల వైద్యులు గోపాలం శివన్నారయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని నవజ్యోతి పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించి వైద్యశిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నచిన్న పనులకు సైతం వాహనాలకు వాడకుండా నడక ద్వార వెళ్లడం, ఆహారాన్ని మితంగా తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు మందులను వాడాలని తద్వార జీవనప్రమానాన్ని పెంచుకోవచ్చన్నారు. అనంతరం పక్షవాతం, ఫీట్స్, బీపీ, షుగర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో అబ్యాస్ స్కూల్ అధినేత నిరంజన్‌రెడ్డి, భాస్కర్, రహెనాఅలీ, నిర్వాహకులు శ్రీనివాస్, రమణారెడ్డి, డాక్టర్ కోమలి, సుదర్శన్ రెడ్డి, సత్యనారయణరావు, శోభా రాణి, సురేష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మట్టారెడ్డి పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో సత్తా చాటిన కేఎల్‌ఎన్ విద్యార్థులు


అఖిల


అనిత


హాసిని

మిర్యాలగూడ : ఇండియా నీట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.అఖిల 2783, ఆర్.అనిత 8658, ఆర్.హాసిని 15431వ ర్యాంకులు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారన్నారు. సత్తా చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు పీఎల్‌ఎన్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డిలు అభినందించారు.

దోపిడీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

నల్లగొండ టౌన్: దోపిడీ రహిత సమాజ నిర్మాణమే సీపీఎం లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలో సీపీఎం నల్లగొండ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్, పిట్టల రవి, సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, ఎండీ సలీం, కొండ అనురాధ, నలపరాజు సైదులు, మన్నెం భిక్షం, కానుగు లింగస్వామి, పుల్లెంల శ్రీకర్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వేములపల్లి : సమ్మేళనంలో పాల్గొన్న శ్రీవిద్యానికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు


పెద్దవూర : నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు


వేములపల్లి : మండలంలోని సల్కునూరు క్రాస్‌రోడ్డు వద్ద గల శ్రీవిద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తాము పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను ఒకరినొకరు గుర్తు చేసుకోని ఆహ్లాదంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిన్న వెంకట్‌రెడ్డి, నంద్యాల రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, పరుశురాములు, విద్యార్థులు నరేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, పుల్లయ్య, హాసన్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కిరణ్‌రెడ్డి, యాదగిరి, కల్యాణి, స్వప్న, శోభ, లక్ష్మీ, విజయ, మంజుల పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని పులిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004-05 సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 20ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో నాడు వారు గడిపిన క్షణాలు, జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా, సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయుల ఆశీర్వాదం తీసుకొని గురువులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అంజయ్య, మట్టయ్య, బాలునాయక్, పుణ్య వతి, సమీమున్, విద్యార్థులు ఏడుకొండలు, ఆంజనేయులు, సైదులు, యల్లయ్య, విక్రమ్, రవి, ముత్యాలు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పేరూర్ దేవాలయ భూముల కౌలు వేలం

హాలియా : మండలంలోని పేరూర్ గ్రామ శ్రీ స్వయంభూ సోమశ్వరస్వామి దేవస్థాన భూముల కౌలుకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సీహెచ్ వెంకటనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 ఒక సంతవత్సరానికిగాను దేవాలయం ఆధీనంలో ఉన్న 146 ఎకరాలకు కౌలు వేలం జరుగుతుందన్నారు. భూముల కౌలు వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ. 10వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలన్నారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోగా దేవాలయ భూములకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు కౌలు వేలంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

● గుంతల రోడ్డుతో అవస్థలు


రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంత

దేవరకొండ : పట్టణంలోని పలు కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు దెబ్బతినడంతో పాదచారులు, వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు నూతనంగా నిర్మించేందుకు నిధులు సైతం మంజూరైనట్లు తెలుస్తుంది. గుంతలు పడి అస్తవ్యస్తంగా మారిన రహదారులతో నిత్యం పలుచోట్ల ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పట్టణంలోని విష్ణు కాంప్లెక్స్ వెనుక కాలనీలో అంతర్గత సీసీ రోడ్డుపై గుంత ఏర్పడడంతో ఇప్పటికే పలుమార్లు వాహనదారులు కిందపడి గాయాలపాలైనట్లు కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు


మాజీ మంత్రి జానారెడ్డిని సన్మానిస్తున్న సాగర్ నియోజకవర్గ జర్నలిస్టులు

నాగార్జునసాగర్ : సాగర్ నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలను ఇప్పించనున్నట్లుగా మాజీ మంత్రి జానారెడ్డి తెలిపారు. ఆదివారం నాగార్జునసాగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని అన్నిమండలాల జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జానారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జానారెడ్డి సానుకూలంగా స్పందించారు. మండల పరిధిలోని వారి సొంత గ్రామంలోనే ఇంటి స్థలం చూసుకోవాలని తెలిపారు. ఇంటి నిర్మాణం కూడా గ్రామాలలోనైతే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తాను అర్హులందరికీ ఇప్పించేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పేలపూడి బాల కృష్ణ,దోసకాయల లింగయ్య, అలుగుల వెంకట్‌రెడ్డి, నర్సింహా, అట్టెం రవి,చాపల నరేందర్, శ్రీను, రవితేజరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

19న మందకృష్ణ మాదిగకు సన్మానం


భవానిని సన్మానిస్తున్న మాదిగ వికలాంగులు

హాలియా : ఈ నెల 19న హైదరాబాద్‌లో వికలాంగుల ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డును పొందిన మంద కృష్ణను సన్మానించనున్నట్లు వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవాని చౌదరి తెలిపారు. హాలియాలో ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వికలాంగుల హక్కుల కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సన్మానసభకు వికలాంగులు పెన్షన్ దారులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలన్నారు. మంద కృష్ణ మాదిగ వికలాంగులను ఏకం చేసి వీహెచ్‌పీఎస్ సంఘాన్ని స్థాపించి పెన్షన్లు పెంచాలని పోరాటం చేయడం వల్లే రూ. 4వేలు పెన్షన్లు అందుతున్నాయన్నారు. మందకృష్ణ మాదిగ వికలాంగులకు ఆత్మీయ బంధువు అని కొనియాడారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవింద్ నరేష్, జానకి రామయ్య చౌదరి, గాదె రమేష్, కొమిరె స్వామి, ఇరిగి శ్రీశైలం, బన్నీ, గార్లపాటి ప్రసాద్, ఏర్పుల వెంకటయ్య, కళ్యాణ్ పాల్గొన్నారు.

రామశర్మ ఆశయ సాధనకు కృషి చేయాలి


దేవరకొండ : రామశర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, తదితరులు

దేవరకొండ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే బొడ్డుపల్లి రామశర్మ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన బొడ్డుపల్లి రామశర్మ 8వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే బాటగా ఎంచుకొని ఆరు దశాబ్దాల పాటు పేద ప్రజల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప నాయకుడు రామశర్మ అన్నారు. దేవరకొండ తాలూకాలో పల్లా పర్వత్‌రెడ్డి, ఉజ్జిని నారాయణరావుతో కలిసి రామశర్మ ఉద్యమాలు నడిపినట్లు ఆయన గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆదర్శంగా జీవించిన కమ్యూనిస్టు నేత రామశర్మ అని ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, దేప సుదర్శన్ రెడ్డి, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనే యులు, పల్లా రంగారెడ్డి, కిన్నెర యాదయ్య, జూలూరి జ్యోతిబసు, మైనొద్దీన్, మల్లయ్య, శ్రీను, మల్లేష్, తదితరులున్నారు.


డిండి : నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డిండి : మండల పరిధిలోని కందుకూర్ గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే బొడ్డుపల్లి రామశర్మ 8వ వర్ధంతి వేడుకలు సీపీఐ నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రామశర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి శైలేష్, లక్ష్మారెడ్డి, సైదులు, గోవర్దన్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ విద్య

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం
- ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో ప్రవేశాలు
- ప్రథమ సంవత్సరంలో 40 మందికి అవకాశం


కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రంలో 2017లో కస్తూరిగాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతేడాది వరకు ఆరు నుంచి పదో తరగతి వరకు మాత్రమే ఉన్న ఈ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఇక్కడ కేజీబీవీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రారంభం అయ్యింది. దీంతో కేజీబీవీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్న ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరినట్లయింది.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో ప్రవేశాలు

ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రథమ సంవత్సరంలో 40 మంది బాలికలు విద్యనభ్యసించేలా సీట్లు మంజూరు చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చదువుకునేందుకు అవకాశం లభించడంతో ఈ ప్రాంత విద్యార్థినీలకు ఒక వరంగా మారనుంది.

సద్వినియోగించుకోవాలి



కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్ విద్య అవకాశం కల్పించి, ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. 40పరిమిత సీట్లు మాత్రమే అవకాశం ఉన్నందున విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం నిర్మించిన నూతన భవనంలోనే బోధన కొనసాగుతుండటంతో విద్యార్థులకు సకలసదుపాయాలతో బోధన అందనుంది.

– కవిత, ఎస్‌ఓ

● దారి ఇలా.. వెళ్లేదెలా..


కంకర పరిచిన రోడ్డు

డిండి : మండల పరిధిలోని రహమంతాపూర్ గ్రామం నుంచి చెర్కుపల్లికి వెళ్లే మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చడానికి సంవత్సరం క్రితం కంకర పరిచారు. కానీ ప్రస్తుతం కంకర పరిచిన రోడ్డుపై ప్రయాణం చేయలేక ప్రయాణికులు ప్రతినిత్యం ప్రమాదాలకు గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే బాలూనాయక్, సంబంధితాధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.